# కౌమువ రేకలు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

వీధిలో అల్లరవుతోంది. ఎవరో ఎవరినో తరుముతున్నట్లు, క్రరలతో, కత్తులతో ఒకరిని ఒకరు ఎదుర్కొంటోన్నట్లు అలజడి జరుగుతోంది.

ఎక్కడో ఫటేల్మంది. ఆ వెనుకనే భయంకరమైన కేకవినిపించింది. కేక వేసిన వాళ్లే కాబోలు దభేల్‌మని నేలమీద పడిపోయారు.

రహమున్నీసా చటుక్కున తలుపు మూసి గడియ పెట్టింది. ఆమెకు గుండెలు దడదడలాడు తున్నాయి. శరీరం వొణుకుతోంది. మెదడులో ఏదో తెలియని కలవరం బయల్దేరింది. రోడ్డు మీద హిందువులూ ముస్లిములూ ఒకరినొకరు పొడుచుకుని చచ్చిపోతున్నారు.

తమ ఇంట్లోకి ఎవరయినా హిందువు చొరబడతాడేమో? రహమున్నీసా లోపలి గదిలోకి వెళ్లిపోయింది. ఆ గది కూడా మూసి లోపలివైపు గడియపెట్టింది. అయినా ఆమెలో దడ తగ్గలేదు. గుండెలమీద చేతులుంచుకుని గదిలో గచ్చుమీద కూలబడి పోయింది.

ఎంతసేపు అలా కూర్చుందో తెలియదు. బయటి తలుపు తడుతున్నట్టుగా శబ్దమయింది. రహమున్నీసాకు తలుపు తెరవడానికి ధైర్యం చాలడం లేదు. తలుపు తెరచి మృత్యువుకు ఎదురు వెళ్లినట్టవు తుందేమోనని ఆమె బెంగ! తలుపు తెరవక పోతే అవతల ఎవరున్నారో ఏం తెలుస్తుంది? తన భర్త రావలసిన సమయం అయింది. పెద్దవాడు బడి నుండి రావలసి ఉంది. నగరంలో అకస్మాత్తుగా మతకలహాలు రేగాయి. ఉదయానికి పరిస్థితి బాగానే వుంది. మధ్యాహ్నానికి మాత్రం పరిస్థితి వేడెక్కిపోయింది.

రహమున్నీసా గుండె దిటవు చేసుకుంది. మెల్లగా తలుపు తెరచి వీధి గుమ్మం వద్ద ఆగింది. తలుపు మీద కంగారుగా ఎవరో తలుపు బాదుతున్నారు.

"రహీ!" ఆందోళనగా పిలుపు వినిపించింది.

రహమున్నీసా చటుక్కున తలుపు తెరచింది. ఖాన్ వగరుస్తున్నాడు. భయంతో అతని మొహం పీక్కుపోయింది. తలుపు తెరవగానే చటుక్కున లోపలికి దూకి తలుపు మూశాడు.

"మీరా?" అంది హీనస్వరంతో ఆమె.

ఖాన్ నిట్టూర్చాడు. "అబ్బాయి ఇంకా రాలేదు కదా!" అన్నాడు.

"రాలేదు" అంది రహమున్నీసా.

"రోడ్డు మీద రెండు శవాలున్నాయి. పోలీసులు కాపలావున్నారు. నీకు తెలిసే వుంటుంది!" అన్నాడు ఖాన్.

"తెలియదు. అల్లరయింది. ఎవరో కొట్టుకుంటున్నారని నాకు తోచింది. అంతే! తలుపులు మూసుకుని లోపల కూర్చున్నాను.

"ఇంకానయం! నువ్వు ఇక తలుపు తియ్యకపోతే ఆ పోలీసులు నన్ను కూడా అనుమానించేవారు?"

రహమున్నీసా తలూపింది. వంటింట్లోకి వెళ్లింది. ఫ్లాస్కులోంచి టీ గ్లాసులోకి ఒంపి భర్తకు అందించింది. టీ తాగాక ఖాన్ తేరుకున్నాడు.

"అబ్బాయి కోసం బడికి వెళ్లివస్తాను!" అన్నాడు ఖాన్.

"అమ్మ నాయనోయ్, సాయంకాలం అవుతుంది. ఇప్పుడు మీరు కూడా బయటికి వెళ్లిపోతే ఎలా? నాకు చాలా భయంగా వుంది" అది రహమున్నీసా.

"ఎలా చెప్పు? నగరంలో హిందువులు మనని బతకనియ్యడం లేదు. అబ్బాయికి ఏమయినా అయితే బతకగలమా?"

రహమున్నీసా మెత్తబడింది. నిజమే! కరీం తమకి ఒక్కగానొక్క కొడుకు. మతకలహాలు రేగినప్పుడు వాడికేమయినా అయితే తాను బతకలేదు. ఖాన్ చేతులు పుచ్చుకుంది. మెల్లగా తల వొంచుకుంది. ఖాన్ ఆమెకు ధైర్యం చెబుతున్నట్టుగా వీపు నిమిరి బయటకు నడిచాడు. రహమున్నీసా మరల తలుపు మూసుకుంది.

ఖాన్ రోడ్ల మీదకు చూసి బిత్తరపోయాడు. రోడ్లన్నీ నిర్జనంగా వున్నాయి. పోలీస్ వాన్ తిరుగుతోంది. వాన్‌లో ప్రకటిస్తున్నారు. ఆ ప్రకటన ఏమిటో ఖాన్‌కి అర్థమయిపోయింది.

నగరంలో కర్ఫ్యూ ప్రకటించారు. ఎవరూ తిరగడానికి లేదు. ఇళ్లలోంచి బయటికి రావద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఖాన్ సందు మలుపుల లోంచి పోలీసుల కళ్లు కప్పి బడివద్దకు చేరుకున్నాడు.

బడిమూసి వుంది. బడివద్ద ఒక పోలీసు కాపలా వున్నాడు. ఖాన్ ఇరకాటంలో పడ్డాడు. పిల్లలను త్వరగా ఇంటికి తిప్పి పంపించేసి నట్టున్నారు. ఆ విషయం ఎవరిని అడగడం? పోలీసు కానిస్టేబులును అడిగితే తనను బంధించవచ్చును. ఆ సమయంలో ఇంట్లోంచి బయట పడకూడదు మరి! ఇప్పుడు తాను ఏం చేయడం?

ఖాన్! తిరిగి సందుగొందుల్లోంచి నడుచుకుంటూ ఇంటికి చేరుకున్నాడు. కొడుకు ఇంటికి రాలేదు. ఆ రాత్రి భార్యా భర్తలకు నిద్రానిప్పులూ లేవు. బయట ఎక్కడ చప్పుడయినా కరీమ్ వచ్చినట్టు వాళ్లు వులికి పడేవారు.

రాత్రి పదయింది. పదకొండు కావస్తోంది. ఇంట్లో శ్మశాన ప్రశాంతి నెలకొని వుంది. కరీమ్ కేమయింది? కరీమ్ ఎక్కడికి వెళ్లిపోయాడు? అతడిని హిందు ముష్కరులు పొట్టన పెట్టుకున్నారా?

పదకొండు గంటలు కొడుతోంది గడియారం. అల్లాబక్ష్ వచ్చాడు. అతడు ఒంటిగా ఎప్పుడూరాడు. వెంట పదిమందిని తీసుకువచ్చాడు. అందరూ ముస్లిం సోదరులే! అందరి వద్దా సైకిలు చైనులో, లాఠీలో, వంకర కత్తులో లాంటి మారణాయుధా లున్నాయి. అల్లాబక్ష్ వరసకు ఖాన్‌కు బావ అవుతాడు. రహమున్నీసా పెద్దనాన్న కొడుకు.

"ఏం బావా! అలావున్నావ్?" అడిగాడు అల్లాబక్ష్.

"ఏముంది బావా! కరీమ్‌గాడు స్కూలునుండి ఇంతవరకూ రాలేదు" అన్నాడు ఖాన్.

రహమున్నీసా శోకం తీస్తోంది.

"ఆ! అయితే కరీమ్‌గాడిని ఆ కాఫిర్లు చంపేసి వుంటారు!" అన్నాడు అల్లాబక్ష్.

"అన్నయ్యా! అంత మాటనక! నా బిడ్డ బతికున్నాడను అన్నయ్యా! బతికే వున్నాడను. నేను వాడు లేకపోతే బతకలేను" అంది రహమున్నీసా.

అల్లాబక్ష్ చెల్లెలిని ఓదార్చాడు. "మేం ప్రతీకారం తీర్చుకుంటాం చెల్లెమ్మా. కాఫెర్లను చంపేస్తాం. మన ముసల్మానులను బతికించుకుంటాం!" అన్నాడు.

"అమ్మ నాయనోయ్! మీరు ఇలా కట్టుకుని అందుకోసం వచ్చారా?"

"అవును చెల్లెమ్మా! రక్తానికి రక్తం! మనిషికి మనిషి! తలకి తల! ఇదే నా సిద్ధాంతం!"

"వద్దన్నయ్యా! వద్దు. నాకొడుకును వెతికి పెట్టండి చాలు. అన్నెం పున్నెం తెలియని మన ముస్లిములను హిందువులు చంపేస్తున్నారు. అలాగే మీరు వెళ్తున్నారు. ఇళ్లలో వుండే అమాయక హిందువుల స్త్రీలనూ,

**ఖాన్, అల్లాబక్ష్ బయటపడ్డారు. హిందువుల పేటలో చొరబడ్డారు. సందులు గొందులు నిర్మానుష్యంగా వున్నాయి. వీధులలో సైనికులు కవాతు చేస్తున్నారు. మత కలహాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.**



పిల్లలనూ చంపేస్తారు. దీనివల్ల లాభం ఏముంటుంది? అటు ప్రక్క అమాయకులు బలయిపోతున్నారు. ఇటు ప్రక్క మనలోనూ నాశనమై పోతున్నారు!"

"ఇదేమిటమ్మా? ఇదెక్కడి వాదం? మన వాళ్లను చంపుతున్న దుర్మార్గులను నువ్వు అమాయకులంటున్నావ్! నీ ది మాక్ ఖరాబ్ కాలేదు కదా!"

"లేదన్నయ్యా, నా బుర్ర ఏమీ పాడు కాలేదు. మన వాళ్లను చంపిన వాళ్లను మీరు పట్టుకోలేరు. హత్యలు చేయడంలో ఆరితేరినవాళ్లు!

"మేమూ అంతేనమ్మా! వాళ్లను తీసిపోము! మా తడాఖా చూపిస్తాం. ఖాన్‌ని మా వెంట పంపించవమ్మా!"

'అంతేనంటావా అన్నయ్యా! ఇంతసేపు చెప్పినా నీ మనసు కరుగలేదు కదా!"

"కరగదమ్మా! ఈ మనసు కొయ్యబారిపోయింది. బావా! పదవోయ్ కండకి కండ చీల్చి పారేద్దాం కాఫిర్లను!"

ఖాన్‌లో వెర్రి ఆవేశం వచ్చింది. 'ఈ దారుణం చూడలేను అన్నట్టుగా రహిమున్నీసా అరచేతులలో ముఖం కప్పుకుంది. కన్నీళ్లతో ఆమె దోసిలి తడుస్తోంది. కొడుకు ఏమయ్యాడు? అతడిని వెతకవలసిన పరిస్థితిలో భర్త హిందువులను చంపడానికి బయలుదేరుతున్నాడు. ఇదెక్కడి మూకబలం! ఇంతసేపూ విషాదంలో మునిగిపోయిన భర్త ఒక్కసారిగా వుద్రేకం తెచ్చుకుని హత్యలకు బయల్దేరి పోతున్నాడు. ఈ హత్యలను ఆపేదెలా? తానిప్పుడేమైనా చేయగలదా?

ఖాన్, అల్లాబక్ష్ బయటపడ్డారు. హిందువుల పేటలో చొరబడ్డారు. సందులు గొందులూ నిర్మానుష్యంగా వున్నాయి. వీధులలో సైనికులు కవాతు చేస్తున్నారు. మతకలహాల నివారణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంది. నగర మంతటా కర్ఫ్యూ విధించారు.

"జాగ్రత్త భాయ్! హిందూ కాఫిర్లు చాలా మనకు లాగానే బయల్దేరి వుంటారు!" అన్నాడు ఖాన్. ఆ మాట మిగతావారిలో ఆవేశం రగుల్కొలిపింది.

అల్లాబక్ష్‌లో, అనుచరులలో, ఖాన్‌లో కొత్తబలం వచ్చింది. కాస్త రక్తం కళ్ల చూడనిదే ఎలా అనిపించింది. సైనికుల కవాతు శబ్దం దూరంగా వెళ్లే వరకూ స్నేహితులు ఓపిక పట్టారు. ఆ ఇంటి తలుపు తట్టారు.

"ఎవరు?" లోపల నుండి అడిగారు.

"పోలీస్!"

తలుపు తెరచుకుంది. తలుపు అవతల ముసలాయన వున్నాడు. తలుపు తోసుకుని అల్లాబక్ష్ వర్గం లోపలకు వురికింది. ముసలాయనకు తాను చూస్తోంది కలో నిజమో అర్థం కాలేదు. ఏదయితే జరగకూడదని అతడు ముక్కోటి దేవతలను వేడుకున్నాడో అదే జరుగుతోంది. ఏ దేవతా ఆయనను కానీ, ఆయన కోడలినికానీ, మనవడిని కానీ కనికరించలేదు. తన కంటి ముందే కోడలు మానభంగం కావడమూ, మనవడికి నూకలు చెల్లిపోవడమూ ఆయన గుండెను పగలగొట్టాయి.

ముసలాయన చాపచుట్టలాగా పడిపోయాడు.

ఆ ఇంట్లో రక్తం ధారలయి ప్రవహించింది.

"చాలా తృప్తిగా వుంది బావా! ఈ కాఫిర్ల కుటుంబాన్ని మట్టుపెట్టాం!" అన్నాడు అల్లాబక్ష్.

"నిజం బావా! మన కరీంగాడు పోతే పోయాడు. మూడు ప్రాణాలు పొట్టన పెట్టుకున్నాం."

"ఆగండి!" అల్లాబక్ష్ అనుచరుడు అరిచాడు.

"ఏం? ఇంకా ఏముంది? ఇంట్లోవున్న దేవతల విగ్రహాలూ, ఫోటోలూ పగలగొట్టావా?" అడిగాడు అల్లాబక్ష్.

"కాదు. ఈ ముసలాడి కొడుకు పరబ్రహ్మం! వాడే మన అసలు శత్రువు.

"అవును. పరబ్రహ్మంగాడే మన గల్లీలో ముస్లింలని చంపేశాడు!"

"అవును వాడే!" వర్గం అరచింది.

"ఏడివాడు? ఎక్కడ దాక్కున్నాడు."

"వాడు దాక్కోడు. మన వాళ్లను చంపడానికి బయల్దేరి వుంటాడు!" అతడి మాట ముగియకముందే తలుపులు బళ్ళున తెరచుకున్నాయి. వీధిలోంచి పరబ్రహ్మం ఇంట్లోకి దూకాడు.

అనుచరుడి తల తాటిపండులాగా ఎగిరి ముసలాయన శవం మీద పడింది. ఖాన్, అల్లాబక్ష్ చైనుంతో ముందుకు దూకారు. గొడ్డలికి, సైకిలు చైనులుకూ పోరాటం జరుగుతోంది.

"అబ్బా!" అన్నాడు ఖాన్.

అవతల పరబ్రహ్మం మెడ వొరుసుకుపోయింది. వెళ్లి గోడకు కొట్టుకున్నాడు. అల్లాబక్ష్ ప్రక్కకు చూశాడు. ఖాన్‌కి గుండెలమీద తగిలిందేమో, గొడ్డలి తీవ్రమైన గాయం చేసింది. ఖాన్ విరుచుకు పడిపోయాడు. అవతల పరబ్రహ్మం. ఇవతల ఖాన్ గిలగిల తన్నుకుంటున్నారు. తన్నుకుంటూనే ఇద్దరు గది మధ్యకు వచ్చారు. ఇద్దరిలోనూ చలనం ఆగిపోయింది. రక్తం ధారలై ప్రవహిస్తోంది. రెండుధారలూ కలిసి ఏకధారగా పల్లానికి పాకుతున్నాయి. అల్లాబక్ష్‌కి అతడి అనుచరులకూ మతులు పోయాయి. అటు ముస్లిం రక్తమూ, ఇటు హిందువు రక్తమూ కలగలసి పోయింది. రక్తంలో తేడాలేదు. మనుషుల ఆలోచనా క్రమంలో మాత్రమే తేడావుంది. శరీరనిర్మాణం ఇద్దరిలోనూ ఒకటే! వాళ్ళు అనుసరిస్తోన్న మత భావాలలో మాత్రమే అంతరంవుంది.

మనిషి మనిషిగా బతకడానికి అడ్డం వచ్చే మతభావాలు మనుషులు క్రూరంగా తన్నుకు చావడానికి మాత్రమే పనికివస్తున్నాయి.

"ఖాన్ శవాన్ని మోసుకురండి!" అన్నాడు అల్లాబక్ష్.

అనుచరులు మౌనంగా శవాన్ని భుజాని కెత్తుకున్నారు. వీధిలో సైనికుల కవాతు వినిపిస్తోంది. సందుల్లోంచి పడి నడుస్తోన్నాడు అల్లాబక్ష్. సందుల్లోంచి అతడి కంటే ముందుగా ఎవరో తప్పించుకు పోతున్నారు. అనుచరులలో ఆవేశం తిరిగి వచ్చింది. సైనులూపుతూ పరుగెత్తారు. అప్పుడే ఒక స్త్రీ చీకట్లోకి తప్పుకుంటోంది. ఆమె వెంట కుర్రవాడున్నాడు.

"దీరా... హిందూ సైతాన్ అయివుంటుంది!" అన్నాడు అల్లాబక్ష్.

అనుచరులు ఆమెనూ, కొడుకునూ చీకట్లోంచి ఇవతలకు లాగారు. చైనులు విసరబోయారు. కొద్దిలో ఇద్దరి కంఠాలూ చుట్టి వీళ్ళేసేవే చైనులు!

"భయ్యా!" అరచిందామె.

అల్లాబక్ష్ ఆ గొంతును గుర్తుపట్టాడు "చెల్లీ!" అన్నాడు.

రహమున్నీసా అతడి పాదాల మీద వాలిపోయింది.

కరీమ్ చీకట్లో భయంకరంగా కనిపిస్తోన్న నీడలవైపు చూస్తున్నాడు.

"నువ్వా! ఇంకానయం! వీడెక్కడ దొరికాడమ్మా!"

"అన్నయ్యా! బడిలో వుండగా కర్ఫ్యూ ప్రకటించారు. ఒక హిందువుల కుటుంబం వీడి తలదాచారు. తమ బిడ్డలతోబాటుగా వీడిని కంటికి రెప్పలాగా కాపాడుకున్నారు. వీళ్ళ స్నేహితులందరి ఇళ్ళూ వెతుక్కుంటున్నాను. నా అదృష్టం బాగుంది! దొరికాడు నా కొడుకు!"

"నేను నమ్మనమ్మా! హిందువులు దుర్మార్గులు!"

"హిందువులంతా దుర్మార్గులు కారన్నయ్యా! అలాగే మన ముస్లిములందరూ దుర్మార్గులు కారు. ఏ మతంలోనయినా మంచి వాళ్ళూ చెడ్డవాళ్ళూ పడుగు పేకల్లాగా కలిసిపోయి వుంటారు."

అల్లాబక్ష్ అనంగీకారంగా తలూపాడు.

"మీ బావ ఏరన్నయ్యా?"

అల్లాబక్ష్ మౌనంగా చెల్లెలి మొహంలోకి చూశాడు. ఆ అమాయకురాలి మొహం అతడి గుండెలను కలచివేస్తోంది. మొదటిసారిగా అతడు తన జీవితంలో పునరాలోచించుకోవలసి ఇబ్బందిలో పడ్డాడు. ఆమె భర్తను తాను మత కలహంలో బలిపెట్టాడు. ఆ సంగతి ఎలా చెప్పడం? ఆమె బతుకుకూ ఆమె సమస్యకూ తన వద్ద పరిష్కారం వుందా?

"హిందూ ముస్లిం భాయి భాయి!" వీధిలో ఏదో స్వచ్ఛంద సేవాదళం కాబోలు రాగయుక్తంగా పాడుతోంది.

అల్లాబక్ష్ చెల్లెలి మొహాన్ని అరచేతులలోకి తీసుకున్నాడు.

"క్షమించుతల్లీ!" అన్నాడు.

"హిందూ ముస్లిం భాయ్ భాయ్!" నినాదాలు ఇంకా దగ్గర పడుతున్నాయి.

"అవును తల్లీ! మనం మనుషుల మందరిగానే బతకాలి! మతాలు నమ్ముకున్నాం! మనుషులమనే మాట మరచిపోతున్నాం! నిజం తల్లీ!..." అల్లాబక్ష్ జీవితంలో మొదటిసారిగా ఏడుస్తున్నాడు.

స్వచ్ఛంద సేవాదళంలో కొందరు హిందువులు కూడా వున్నట్టున్నారు. వాళ్ళు అల్లాబక్ష్‌ని సమీపించారు.

"రా భాయి!" అన్నారు వాళ్ళు.

అల్లాబక్ష్ చేతిలోని చైను జారిపోయింది.

దళంలోంచి కొందరు ముస్లిములు వచ్చారు. హిందువుల భుజాల మీద వాళ్ళు చేతులు వేశారు.

"హిందూ — ముస్లిం భాయ్ భాయ్!" అన్నాడు అల్లాబక్ష్ ఏడుస్తూ.

ఎక్కడో కాకులు అరుస్తోన్నాయి.

రహమున్నీసా మ్రాన్పడిపోయి వుంది. వేకువరేకలు విచ్చుకుంటున్నాయి. అనుచరుల భుజాలమీద వున్న ఖాన్ శవం ఆమె కంట్లో పడినట్టుంది.

అందుకే ఆమె ఇంకా మ్రాన్పడి పోయే వుంది.

'హిందూ — ముస్లిం భాయ్ భాయ్!'

నినాదాలు దూరమవుతున్నాయి — ఆమె జీవితంలోని వేకువ రేకల్లాగానే!

"క.... రీ... మ్...!" కన్నతల్లి గుండె ఆక్రోశిస్తోంది.

"హిందూ.... ముస్లిం... ... ..."

*



## ఉపాయం

రద్దీగాఉన్న ఓ షాపులో భార్య తనను వదిలి ఎటువైపు వెళ్ళిందో అర్థంకాని శంకర్ బాగా ఆలోచించి అందంగాఉన్న ఓ సేల్స్ గర్ల్ దగ్గరకు వెళ్ళి మాట్లాడుతున్నట్లు నటించాడు. క్షణాల్లో అతని భార్య పరుగెత్తుకొంటూ అతడ్ని చేరింది.

—జోకర్ (హైదరాబాద్)

